ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 30 ఏప్రిల్ 2025 www.prajaswaramdaily.com 4 pm

# అజారుద్దీన్‌కు రిలీఫ్

## నార్త్ స్టాండ్ కు ఉన్న ఆయన పేరు తొలగించొద్దు

## హెచ్‌సీఏ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ : అజారుద్దీన్ కి హైకోర్టులో ఊరట లభించింది. ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కి అజారుద్దీన్ పేరు తొలగించవద్దని హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘంకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హెచ్‌సీఏను హైకోర్టు ఆదేశించింది. నార్త్ స్టాండ్స్‌కు ఉన్న అజహరుద్దీన్ పేరు తొలగించాలని గత వారం హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశాలు జారీ చేశారు. తన పేరును తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు అజారుద్దీన్. రెండు దశాబ్దాల పాటు క్రికెటర్‌గా భారత జట్టుకు




సేవలందించానని.. దాదాపు పదేళ్లపాటు టీమిండియా కెప్టెన్‌గా ఉన్నానని తెలిపారు. అంబుడ్స్‌మన్ ఆదేశాలపై స్టే ఇవ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు అజారుద్దీన్ పేరు తొలగించవద్దని ఆదేశించింది.

# బాలికలదే హవా

## టెన్త్ పాస్ 92.78 శాతం





## సత్తాచాటిన గురుకులాలు

## తెలంగాణ పదోతరగతి ఫలితాలు విడుదల


హైదరాబాద్ : తెలంగాణలో 2024లోని టెన్త్ ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు వచ్చిన 9.85 లక్షల మంది విద్యార్థుల్లో 92.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది కంటే ఈ శాతం 1.47 పాయింట్ల మెరుగుదలని సూచిస్తోంది. ఈ ఫలితాలను విద్యామంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 5,07,107 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో రెగ్యులర్ , ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నారు. విడుదలైన ఫలితాల ప్రకారం, రెగ్యులర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 92.78 శాతంగా నమోదైంది. ఇది గత ఏడాది నమోదైన 91.31 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల, దాదాపు 1.47 శాతం అధికం.

. ఈసారి కూడా బాలికలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకున్నారు. బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణతతో వారిని అధిగమించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలికల ఉత్తీర్ణత శాతం బాలుర కంటే 2.94 శాతం అధికంగా ఉండటం విశేషం. ఇక ప్రైవేట్ విద్యార్థుల విషయానికి వస్తే, వారి మొత్తం ఉత్తీర్ణత శాతం 57.22 శాతంగా ఉంది. ఇక్కడ కూడా బాలికలే పైచేయి సాధించారు. ప్రైవేట్ బాలురు 55.14 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, బాలికలు 61.70 శాతం ఉత్తీర్ణతతో వారి కంటే 6.56 శాతం అధికంగా రాణించారు. పాఠశాలల వారీగా ఫలితాలను పరిశీలిస్తే, రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. మరోవైపు రెండు పాఠశాలలు మాత్రం ఒక్క విద్యార్థిని కూడా ఉత్తీర్ణత సాధించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే, మహబూబాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అత్యధికంగా 99.29 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా అత్యల్పంగా 73.97 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసింది. ఈసారి ఫలితాల్లో గురుకుల పాఠశాలలు తమ సత్తాను మరోసారి చాటాయి. దాదాపు 98.7 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసి, సాధారణ పాఠశాలలకు ఆదర్శంగా నిలిచాయి.



# దేవినేని కుమారుడి వివాహానికి సీఎం రేవంత్

విజయవాడ : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్ పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కంకిపాడులో జరిగిన ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణతో పాటు ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఇక, తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విజయవాడ వెళ్లిన సీఎం రేవంత్‌కు హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్, సీఎం రేవంత్ రెడ్డి కలిసి వివాహ వేడుక వద్దకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు.




## మహాత్మా బసవేశ్వరకు నివాళి

హైదరాబాద్ : సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మ శ్రీ బసవేశ్వర జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది శ్రీ బసవేశ్వర అని స్మరించుకున్నారు.

## మావోయిస్టుల కోసం ఉపగ్రహ ఛాయాచిత్రాలు

### కర్రెగుట్టల్లో తొమ్మిదో రోజు భద్రతా బలగాల ఆపరేషన్

చర్ల: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో తొమ్మిదో రోజు భద్రతా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. బ్లాక్‌హిల్స్‌గా పేరుగాంచిన కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం వేట సాగిస్తున్నారు. ఇప్పటికే అన్ని సరిహద్దు ప్రాంతాలను భద్రతా బలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలోనే 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆపరేషన్‌లో పాల్గొని అలసిన బలగాలు వెనక్కి వస్తున్నాయి. దీంతో వారి స్థానంలో బ్యాకప్ పార్టీలను తరలించారు. మావోయిస్టుల ఆచూకీ కోసం ఉపగ్రహ ఛాయా చిత్రాలు వినియోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టారు. పూజారీ కాంకేర్, నడిపల్లి ప్రాంతాలు మంగళవారం బాంబుల శబ్దాలతో హోరెత్తాయి. ఈ ఆపరేషన్ పర్యవేక్షణ కోసం ఐబీ చీఫ్ తపన్ దేకా రంగంలోకి దిగారు. రాయ్‌పుర్‌లో ఆపరేషన్‌పై ఆయన కీలక సమావేశం నిర్వహించారు.



### భూదాన్ భూముల కేసులో

# ఐపీఎస్‌లకు చుక్కెదురు

## సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరణ

## ఐపీఎస్ అధికారుల తరపు వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం

హైదరాబాద్: భూదాన్ భూముల కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించలేదు. ఈ వివాదంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఏప్రిల్ 24న కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు భూములను ఏప్రిల్ 27 నుంచి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది.

సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మహేశ్



భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 194లో ఉన్నది పట్టా భూమి అని, భూదాన్ భూమి కాదని కోర్టుకు తెలిపారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే సింగిల్ బెంచ్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చిందని వారు వాదించారు. పిటిషనర్ కోరిన దానికంటే ఎక్కువ ఉపశమనాన్ని సింగిల్ బెంచ్ కల్పించిందని, పిటిషన్‌ను ఉపసంహరించుకోవద్దని రిజిస్ట్రీని ఆదేశించే అధికారం కూడా సింగిల్ బెంచ్‌కు లేదని వారు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

# ఢిల్లీలో భారీ కుంభకోణం

## విలువ రూ. 2వేల కోట్లు

## -ఆప్ నేతలపై ఏసీబీ కేసు

న్యూఢిల్లీ : ఆమాద్మీ పార్టీ నేతలపై ఏసీబీ కేసు నమోదైంది.

పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ అభియోగం. ఇందులో ఆప్ మాజీ మంత్రులు మనీశ్ సిసోదియా , సత్యేందర్ జైన్‌లు ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో దిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కాయి. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా




అయ్యింది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది.